భీమవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 26.0

తణుకు : 34.0 - 26.0







శకటాలు వెళ్ళేందుకు ఏర్పాటు చేసిన రోడ్డు... ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న అధికారులు.. సిద్దమైన వ్యవసాయ శాఖ శకటం

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సన్నద్ధం

పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు

ముఖ్య అతిథిగా మంత్రి నిమ్మల రాక

భీమవరం టౌన్, ఆగస్టు 14: జిల్లా కలెక్టర్ కార్యాలయ అవరణలో ఉన్న పరేడ్ గ్రౌండ్‌లో 78వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాన వేదికతో పాటు ప్రముఖులు, ప్రజాప్రతినిదులు, జిల్లా అధికారులు, స్వాతంత్ర్యసమరయోధులు కూర్చునేందుకు వీలుగా వేదికలను సిద్ధం చేశారు. వేదిక ముందు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శకట ప్రదర్శన, పోలీస్ గౌరవ వందనం స్వీకరించేందుకు వీలుగా ప్రత్యేక రోడ్డును ఏర్పాటు చేశారు. వేదికకు ఎడమ వైపున వివిధ శాఖల స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. 11 శాఖలకు సంబంధించిన శకటాలను ఆయా శాఖల జిల్లా అధికారుల పర్యవేక్షణలో సిద్ధం చేశారు. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేందుకు విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వేడుకలను తిలకించేందకు వచ్చిన ప్రజల కోసం వేదికకు కుడివైపున ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు. ఎండలు తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో టెంట్‌లను ఏర్పాటు చెయ్యటంతో పాటు మంచినీటి సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. పారిశుధ్య పనులను మునిసిపల్ అధికారులు పర్యవేక్షించారు. పరేడ్ గ్రౌండ్‌ను సుందరంగా తీర్చిద్దిదారు.

వేడుకలు ఇలా..

పరేడ్ గ్రౌండ్‌లో గురువారం ఉదయం 9గంటలకు మంత్రి నిమ్మల రామానాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఉదయం 9గంటకు వేడకులు ప్రారంభం అవుతాయి. జిల్లా ఎస్పీ హాజరుతోపాటు పరేడ్ బృదంచేసే జనరల్ సెల్యూట్ జరుగుతుంది. మంత్రికి పరేడ్ కమాండర్ చే రాష్ట్రీయ శాల్యూట్ సమర్పణ, 9-05 గంటలకు పరేడ్‌ను మంత్రి నిమ్మల రామానాయుడు సందర్శన, 9-10కి పరేడ్ బృదంచే మార్చ్‌ఫాస్ట్, 9-15 గంటలకు మంత్రి రామానాయుడు ప్రసంగం, 9-50కు పరేడ్ బృందం నిష్క్రమణ, వివిధ శాఖల శకటాల ప్రదర్శన, 10 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 10-30కు విశిష్ట సేవలకు ప్రశంసాపత్రాలు అందజేత, 12గంటలకు వేడుకలు ముగుస్తాయి.



కలెక్టర్ బంగ్లాపై జాతీయ జెండాతో కలెక్టర్ నాగరాణి

ఇన్‌చార్జి ఆర్డీవో ఏర్పాట్ల పర్యవేక్షణ

పరేడ్ గ్రౌండ్‌లో జరిగే స్వాతంత్ర్య వేడకల్లో ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లను పూర్తిస్థాయిలో చేయాలని ఇన్‌చార్జి ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ అధికారులకు సూచించారు. వివిధశాఖల అధికారులతో మాట్లాడారు. ప్రధాన వేదికతోపాటు, స్టాల్స్ వేదిక ఏర్పాట్లుతోపాటు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. వైద్య శిబిరంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధం చెయ్యాలని అన్నారు. ప్రొటోకాల్ ప్రకారం అనుసరించి సిట్టింగ్ ఏర్పాటుపై ఆరా తీశారు. వేడుకల్లో విద్యార్థులు పాల్గొంటున్నందున ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

కలెక్టర్ బంగ్లాపై జాతీయ జెండా

హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారంనాడు జిల్లా కలెక్టర్ నాగరాణి జాతీయ పతాకాన్ని భీమవరంలోని కలెక్టర్ బంగ్లాపై ఎగుర వేశారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపు నిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం వివిధ శాఖ లకు ఆదేశాలు జారీ చేశారు. ఊరూ వాడా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించాలని అన్నారు. జాతీయ జెండాతో ఉన్న సెల్ఫీ ఫొటోలను, వీడియోలను గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా అప్ లోడ్ చేయాలని అన్నారు.



పండుగ కానుకలు

సంక్రాంతి, క్రిస్మస్ కానుకలతో పాటు రంజాన్ తోఫాకు

కూటమి ప్రభుత్వం కసరత్తు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 14: నిరుపేదలకు పండగ పూట పస్తులు ఉండకూడదనే తలంపుతో కూటమి ప్రభుత్వం మళ్లీ కానుకలు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. గత టీడీపీ హయాంలో కూడా ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులకు సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుకలను ఆయా వర్గాల వారికి ప్రభుత్వం అందించేది. తరువాత జగన్ సర్కార్ ఆ కానుకలకు మంగళం పాడింది. వీటికి తోడు సాధారణంగా తెల్లరేషన్ కార్డుదారులకు అందించే పంచదార, గోధుమలు, కంది పప్పులను అందించడం మానేసి అరకొర సరుకులు అందించింది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కానుకల కోసం చంద్రబాబు సారధ్యంలో రాష్ట్రంలో సన్నాహాలు చేస్తున్నారు. వీటి కోసం జిల్లాల వారీగా యంత్రాంగం సిద్ధమవుతోంది.

జిల్లాలో 5.56 లక్షల కార్డుదారులు

జిల్లాలో 5లక్షల 56వేల 469 బియ్యం కార్డుదారులు ఉన్నారు. వీరితో పాటు పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డు దరఖాస్తులకు కూడా పరిగణలోకి తీసుకోవలసి ఉన్నది. వీటిని ఇచ్చిన తరువాతే పండుగలకు కానుకలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నది. గతంలో సంక్రాంతి, క్రిస్మస్ కానుకలుగా అరకిలో కందిపప్పు, అరకిలో శనగ పప్పు, అరకిలో బెల్లం, అర లీటరు పామాయిల్, కిలో గోధుమ పిండి, 100 గ్రాముల నెయ్యి ఇచ్చేవారు. రంజాన్ తోఫా కింద ముస్లింలకు 2 కేజీల చక్కెర, 5 కిలోల గోధుమపిండి, కిలో వర్మిసెల్లి, 100 గ్రాముల నెయ్యి అందించేవారు. తాజాగా ఇచ్చే కానుకలను అదే విధంగా అందించే అవకాశం ఉంది.



దొడ్డిపట్ల ఏటి గట్టును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ఏటిగట్ల పటిష్ఠతకు చర్యలు: కలెక్టర్


పాలకొల్లు రూరల్ (యలమంచిలి) ఆగస్టు 14 : మండలంలోని దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, గంగడపాలెం గ్రామాల్లో గోదావరి నదికి ఉన్న ఏటిగట్లను పటిష్టపరిచేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. బుధవారం ఈ గ్రామాల్లో బలహీనంగా ఉన్న ఏటిగట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏటిగట్లు బలహీనంగా ఉన్నాయని, కాబట్టి రానున్న అక్టోబరు, నవంబరు నెలల్లో అల్పపీడనాలు కారణంగా అధిక వర్షాలుకురిస్తే గోదావరికి వరదలు వచ్చే ప్రమాదం ఉందని, అందువల్ల ముందుగానే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దొడ్డిపట్ల వాకల గరువు ప్రాంతంలో సుమారు 700 మీటర్ల పరిధిలో రూ. 2.2 కోట్లు, అబ్బిరాజుపాలెం, గంగడపాలెం, లక్ష్మీపాలెం, యలమంచిలి ప్రాంతాల్లో సుమారు 1800 మీటర్ల పరిధిలో రూ.4.47 కోట్లు వ్యయంతో గట్టు పటిష్టతకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపడం జరిగిందన్నారు. నిధులు త్వరలో మంజూరు అవుతాయని, ఏటిగట్ల పటిష్టతకు అవసరమైన అడ్డంకులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బలహీనంగా ఉన్న ఏటిగట్లను సుమారు 2మీటర్ల ఎత్తున పటిష్ట పరచాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. 2022లో వచ్చిన గోదావరి వరదలు గట్టుపై 4 మీటర్ల ఎత్తున ప్రవహించడం జరిగిందని, గతంలో కొందరి స్వార్ధం కోసం గట్టును ప్రొక్లైన్‌తో చదును చేయడం కారణంగా ఏటిగట్లు మరింత బలహీన పడ్డాయని ఇరిగేషన్ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీవో ఎం అచ్యుత అంబరీష్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



నిట్‌కు కేటాయించేందుకు ప్రతిపాదించిన ప్రాంతం

ఏపీ నిట్‌కు మహర్దశ

- భూమి కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధం
- 50 ఎకరాలు కావాలన్న నిట్ అధికారులు
- వైసీపీ హయాంలోనే ప్రతిపాదనలు
- పట్టించుకోని నాటి ప్రభుత్వం
- కూటమి రాగానే కేంద్ర విద్యా సంస్థలపై దృష్టి



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెంలోని ఆంధ్రప్రదేశ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి పూర్వవైభవం రానుంది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నిట్‌లో మౌలిక వసతులపై దృష్టి పెట్టింది. అదనంగా అవసరమైన భూమిని కేటాయించేందుకు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్ నాగరాణితో వీడియో కాన్ఫరెన్స్‌లో నిట్‌లో మౌలిక వసతులపై చర్చించారు. ఏపీనిట్‌కు గతంలో తాడేపల్లిగూడెం విమానాశ్రయ భూముల్లో 172.5 ఎకరాలు కేటాయించారు. శాశ్వత క్యాంపస్‌కు తొలిఫేజ్‌లో రూ.525 కోట్లు కేటాయించారు. గతంలో తెలుగుదేశం కూటమి అధికారంలో ఉన్నప్పుడే శాశ్వత క్యాంపస్ పూర్తయ్యింది. ప్రతిఏటా 750 మంది విద్యార్థులకు అడ్మిషన్‌లు కల్పించే స్థాయికి ఏపీనిట్‌ను తీసుకువెళ్లారు. వైసీపీ హయాంలో పూర్తిగా పరిస్థితులు తారుమారు అయ్యాయి. ఏపీనిట్‌పై గత వైసీపీ ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. దాంతో మళ్లీ 480 సీట్లకు ఏపీనిట్ పడిపోయింది. మరోవైపు 50 ఎకరాల భూమిని అదనంగా కావాలంటూ ఏపీ నిట్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. అయినా వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. భూమిని కేటాయించలేదు. డ్రెయినేజీ వ్యవస్థ, మంచినీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతులపైనా పెద్దగా పట్టించుకోలేదు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మౌలిక వసతులపై దృష్టి పెట్టారు. ఏపీనిట్‌కు అవసరమైన వసతుల కల్పనపై ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ చర్చించారు. మరోవైపు 50 ఎకరాల భూమి విషయమై చర్చకు వచ్చింది.

కేంద్ర రక్షణ శాఖ అనుమతి తప్పనిసరి

ఏపీనిట్‌కు గతంలో 172.5 ఎకరాలు కేటాయించినప్పుడు రక్షణ శాఖ నుంచి ఎటువంటి అభ్యతరం వ్యక్తం కాలేదు. రాష్ట్ర ప్రభుత్వానికి గతంలో కేంద్రం విమానాశ్రయ భూములను అప్పగించింది. అందుకోసం కొంత సొమ్మును కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం చెల్లించింది. ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించుకునేలా రాష్ట్రస్థాయిలో చర్యలు తీసుకున్నారు. విమానాశ్రయ భూముల్లోనే ఏపీటిడ్కో ఇళ్లను నిర్మించారు. ఏపీనిట్‌కు భూములు కేటాయించారు. తాజాగా భూములు కేటాయించాలంటే రక్షణ శాఖ అనుమతి తప్పనిసరి అన్న సందేహాలు తలెత్తాయి. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ శాఖకు లేఖరాసినట్టు సమాచారం. అక్కడ నుంచి అనుమతి వస్తేనే ఏపీనిట్‌కు అదనంగా భూములు కేటాయించే అవకాశం ఉంది. అనుమతులు రాబట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. నిట్‌కు ఆనుకుని దాదాపు 40 ఎకరాల భూమి ఉంది. అందులోనే 25 ఎకరాలు కేటాయించనున్నట్టు తెలుస్తోంది. అదే జరిగితే విద్యార్థులకు అదనంగా హాస్టల్ వసతిని నిర్మించనున్నారు. వసతులు లేకపోవడం వల్లే సీట్ల సంఖ్య 750 నుంచి 480 తగ్గించేశారు. మరోవైపు ఫ్యాకల్టీ సమస్య కూడా ఉంది. ఇప్పుడు ఫ్యాకల్టీని కూడా కేటాయిస్తూ కేంద్రం అనుమతి మంజూరు చేసింది. ఒకవైపు ఫ్యాకల్టీ నియామకం జరిగితే, మరోవైపు భూములు కేటాయిస్తే నిట్‌లో మళ్లీ 750 సీట్లు కేటాయించనున్నారు. ప్రతిఏటా 750 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించనున్నారు.

రూ. 500 కోట్లకు ప్రతిపాదనలు

ఏపీనిట్‌కు రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించనుంది. అలాగే వెనుకభాగంలో గణేష్‌నగర్ నుంచి నిట్ వరకు 40 అడుగుల రహదారిని వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే రహదారి విస్తరణలో మార్పులు చేశారు. అంతకు ముందు కేవలం కొద్దిపాటి రహదారిని విస్తరించేలా ఏర్పాట్లు చేశారు. తాజాగా శశి ఇంజనీరింగ్ కళాశాల వరకు రెండు లైన్‌ల రహదారి వేస్తున్నారు. దాంతో రహదారి వ్యవస్థకు ఇబ్బంది ఉండదు. అంతేకాకుండా గణేష్ నగర్ నుంచి జీవీ మాల్ వరకు రహదారి విస్తరణకు మున్సిపాలిటీ చర్యలు చేపట్టింది. నివాసితులు ఏర్పాటు చేసుకున్న ర్యాంప్‌లను తొలగించారు. తొలగించిన మార్గంలో రహదారి విస్తరించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి ఆదేశించారు. సదరు రహదారి వెంట ఆక్రమణ దారులకు వేరే చోట స్థలం ఇచ్చి రహదారిని మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా 80 అడుగులకు తీర్చిదిద్దాలన్న ప్రతిపాదనపై కూటమి నేతల్లో చర్చ జరుగుతోంది. అది నెరవేరితో నిట్‌కు మంచి రహదారి ఏర్పడినట్టు అవుతుంది. డ్రెయినేజీ వ్యవస్థ పైనా దృష్టి సారించారు. తక్షణం అదనపు భూమి కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది.

విభిన్న వాతావరణం



వర్షాకాలంలో వేసవి..

ఉక్కపోతతో సతమతం

భీమవరం టౌన్, ఆగస్టు 14 : మూడు రోజులుగా సూర్యడి ప్రతాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. వర్షాకాలంలో ఎండ తీవ్రత పెరగటంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. భీమవరంలో బుధవారం అత్యధికంగా 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 8 గంటల ప్రాంతం నుంచే ఉక్క పోత ప్రారంభం అవుతోంది. 12 గంటలు దాటితే చాలు మేనెలలో ఎండ ప్రభావం ఎలా ఉంటుందో అదే పరిస్థితిని అనుభవిస్తున్నారు. బయటకు వెళ్తే ఎండదెబ్బకు తడిసి ముద్దవుతున్నారు. ఎండ ప్రభావంతో వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడతున్నారు. ఇంటిలో ఉంటే ఏసీ వేసుకుంటే కానీ ఉండలేని పరిస్థితి ఏర్పడింది. రాత్రి సయంలో కూడా ఉక్కపోత తగ్గక పోవటంతో చల్లటిగాలుల కోసం ప్రజలు తిప్పలు పడుతున్నారు. ఇటీవల భారీవర్షాలు కురిసినప్పటికీ వాతావరణం ఇలా ఎందుకు మారిపోయిందో ఆర్ధంకావటంలేదంటున్నారు. ఎండ ప్రభావం కారణంగా జనాలు రోగాల బారిన పడుతున్నారు. జ్వరాలు పెగరటంతో ఆసుపత్రులకు క్యూకడుతున్నారు. చల్లటి పానీయాలకు మళ్ళీ గిరాకి పెరుగుతోంది. అధికారులు సైతం ఎండ దెబ్బకు కంగారుపడుతున్నారు. వ్యవసాయ కూలీలు, ఇంటిపనులకు వెళ్ళేవారు కూడా ఎండకు భయపడి పనులకు తగ్గించేస్తున్నారు. వాహనాలపై ప్రయాణించేవారుసైతం ఎండ వేడిమి నుంచి రక్షణకు టోపీలు, ముఖాలకు రుమాళ్లు కట్టుకుని ప్రయాణాలు చేస్తున్నారు. వర్షాకాలంలో ఉన్నామా, వేసవి కాలంలో ఉన్నామనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బుధవారం తాడేపల్లిగూడెం, తణుకులలో అత్యధికంగా 34 డిగ్రీలు నమోదైంది.



ఉపకులపతి కోసం ఎదురుచూపు

రెండు నెలలుగా ఉద్యాన వర్సిటీలో ఎక్కడి ఫైల్స్ అక్కడే

విద్యా సంవత్సరం ప్రారంభంలో అధికారులకు పరీక్ష

మంచి మిత్రుడిని కోల్పోయా..

మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి 9



కలవాల్సిందే..

అప్పుడే ఇంక్రిమెంట్‌లు.. ఇబ్బందులు పడుతున్న సచివాలయ కార్యదర్శులు

మింగుడుపడని డివిజన్ స్థాయి అధికారి

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సచివాలయ కార్యదర్శులకు కాసింత జీతం. కుటుంబాన్ని నెట్టుకు రావాలి. సంక్షేమ కార్యదర్శులకు మరింత ఇబ్బంది. నెల వచ్చిందంటే ఉద్యోగ బాధ్యతలు అధికంగా ఉంటాయి. సంక్షేమ పలాలను లబ్ధిదారులకు అందించే బాధ్యత వారిదే. సచివాలయ వ్యవస్థలో అధిక బాధ్యతలు నిర్వహించేది సంక్షేమ కార్యదర్శులే. వారికే ఇప్పుడు కష్టమొచ్చింది. జిల్లాలోని ఓ డివిజన్ స్థాయి అధికారి నుంచి ఇబ్బందులు ఎదురవు తున్నాయి. ప్రతిఏటా ప్రభుత్వం ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్ పడాలంటే డివిజన్ అధికారి ఆమోదం అవసరం. సంక్షేమ శాఖ డివిజన్ అధికారి పరిధిలోని మండలాల్లో సంక్షేమ కార్యదర్శులు ఈ ఏడాది ఇంక్రిమెంట్ పొందేందుకు ఇబ్బందులు పడ్డారు. అధికారికి సొమ్ములు చెల్లిస్తేనే సంతకాలు పెట్టారు. లేదంటే అధికారి వద్దకు వెళ్లి వివరణ ఇచ్చుకోవాలి. సొమ్ములు ఇవ్వలేనంటూ చేతులు కట్టుకోవాలి. అప్పుడే ఫైల్‌పై సంతకం పెడతారు. తీరప్రాంత పరిధిలోనే సదరు అధికారితో వెల్ఫేర్ అసిస్టెంట్‌లు ఇబ్బందులు పడ్డారు. జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసే సాహసం చేయలేకపోయారు. సచివాయలయంలోని ఇతర కార్యదర్శులకు ఎటువంటి ఇబ్బందులు లేవు. సంబంధిత శాఖ అధికారులు సంతకాలు చేసేశారు. సంక్షేమ కార్యదర్శుల విషయంలోనూ ఇతర డివిజన్‌ల పరిధిలో సక్రమంగానే ఇంక్రిమెంట్‌లకు అర్హత సాధించారు. ఒక్క డివిజన్‌లో ఇటువంటి దందా సాగుతోంది. సదరు అధికారి పెడుతున్న ఇబ్బందులతో కార్యదర్శులు హడలిపోతున్నారు. కొందరు నేరుగా వెళ్లి సొమ్ములు చెల్లించలేమంటూ బ్రతిమిలాడుకున్నారు. ఇంకొందరు చేయి తడిపి పనిచేయించుకున్నారు. జిల్లా అధికారులకు ఫిర్యాదులు వెళితే చెక్ పెడుతున్నారు. పంచాయతీల్లోని కార్యదర్శుల పదోన్నతుల విషయంలోనూ ఇదే జరిగింది. పదోన్నతుల సవ్యంగా పొందాలంటే సదరుశాఖలోని అధికారి ఇటీవల కార్యదర్శులకు సొమ్ములు కోసం సంకేతాలు పంపినట్టు పంచాయతీ శాఖలో గప్పుమంది. దాంతో కొద్దిరోజుల పాటు పదోన్నతులు ఇవ్వకుండా కలెక్టర్ వేచిచూసినట్టు సమాచారం. పంచాయతీ శాఖలోని కీలక అధికారి ఒత్తిడి తట్టుకోలేక కొందరు కార్యదర్శులు ముడుపులు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలిసిన జిల్లా ఉన్నతాధికారులు కళ్లెం వేశారు. కార్యదర్శులంతా కలిసిన తర్వాతే పదోన్నతులు ఇచ్చారు. జిల్లాలో 54 మంది సిబ్బందికి పదోన్నతులు లభించాయి. పంచాయతీ రాజ్ శాఖలోని అధికారికి కట్టడి చేసిన తర్వాతే పదోన్నతులు ఇచ్చారు. లేదంటే కార్యదర్శుల నుంచి పెద్దమొత్తంలోనే గుంజుకోవడానికి సదరు అధికారి సిద్ధమయ్యారు. మొత్తంపైన జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళితే ముడుపులను కట్టడి చేస్తున్నారు. సంక్షేమ అధికారులు మాత్రం అటువంటి సాహసం చేయలేకపోతున్నారు.

ఆది, సోమ వారాల్లో సికింద్రాబాద్‌కు ప్రత్యేక రైలు

నరసాపురం, ఆగస్టు 14: ప్రయాణికుల రద్దీని పరిగణలోకి తీసుకుని నరసాపురం సికింద్రాబాద్‌ల మధ్య ఆది, సోమవారాల్లో ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు ఎస్ఎం మధుబాబు చెప్పారు. 07169 నంబర్‌తో ఆదివారం రాత్రి 8గంటలకు నరసాపురంలో ఈప్రత్యేక రైలు బయలుదేరుతుంది. పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, నల్లగొండ మీదుగా ఉదయం 5 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరిగి అదే రోజు 07170 నంబర్‌తో రాత్రి 8.30 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5గంటలకు చేరుకుంటుందని ఎస్ఎం చెప్పారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అభివృద్ధిని గాలికొదిలేసిన వైసీపీ

పెంటపాడు, ఆగస్టు 14: గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని గాలికొదిలేసిందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బి.కొండేపాడు, రామచంద్రపురం గ్రామాల్లో రూ.60 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారులకు బుధవారం ఎమ్మెల్యే బొలిశెట్టి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జితో శంకుస్థాపన చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఎంపీపీ దాసరి హైమవతి, సర్పంచ్ కట్టా దానయ్య, దాసరి అప్పన్న, పుల్లా బాబి, గంధం సతీష్, తదితరులు పాల్గొన్నారు.

● తాడేపల్లిగూడెం అర్బన్ : అన్న క్యాంటీన్ల పునఃప్రారంభంతో పేదల కల సాకారం కానుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. పట్టణంలోని తాలూకా సెంటర్ సమీపంలో గల అన్న క్యాంటీన్ వద్ద తన తల్లి రత్నమాణిక్యం జ్ఞాపకార్థం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ బుధవారం అన్న సమారాధన చేశారు. ఈ సందర్భంగా బాబ్జి బొలిశెట్టిని సత్కరించారు. పి.రాంపండు, డి.అప్పన్న, పి.బాబి, డి.కృష్ణవేణి, జి.సతీష్, పి.వెంకటేశ్వరరావు, బి.పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

కిరణ్ కుమార్ రెడ్డికి ఘన స్వాగతం


కిరణ్ కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

పెనుగొండ, ఆగస్టు 14 : ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను పరామర్శించడానికి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి సిద్దాంతం వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, ప్రధాన కార్యదర్శి కె.వెంకటరెడ్డి, పి.సుమన్, పెనుగొండ మండల అధ్యక్షుడు దొడ్డిపట్ల నాగూర్ ఉన్నారు. ఎమ్మెల్యే నివాసంలో కిరణ్ కుమార్‌రెడ్డిని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి దంపతులు కలిశారు.

అంగన్‌వాడీలకు బీఎల్వోల విధులు వద్దు

ఆకివీడు, ఆగస్టు 14 : అంగన్‌వాడీలకు బీఎల్వోలు డ్యూటీలు వేయడం వలన తలకు మించిన భారంగా మారిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం అంగన్‌వాడీలతో కలిసి ధర్నా నిర్వహించి తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పి.అప్పారావు, ఇరానిదేవి, ఆదిలక్ష్మి, కస్తూరి, కృష్ణకుమారి, భ్యాలా, తదితరులు పాల్గొన్నారు.

పొత్తూరి రామరాజుకు పితృవియోగం


పి.నర్సింహరాజు

నరసాపురం రూరల్, ఆగస్టు 14: టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు తండ్రి నర్సింహరాజు (93) బుధవారం యలమంచిలి మండలం వైవీలంకలో మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రామరాజు రెండో కుమారుడు. పొత్తూరిని పలువురు టీడీపీ నాయకులు కలిసి సంతాపం తెలిపారు. జి.శ్రీమన్నారాయణ, కె.రవి, వి.ఉమా, గుబ్బల నాగరాజు, కొల్లు పెద్దిరాజు, షేక్ హుసేన్ తదితరులు ఉన్నారు.

ప్రముఖ కవి బాల చందర్‌కు అవార్డు

పెనుగొండ, ఆగస్టు 14 : స్థానిక ఎస్‌వీకేపీ అండ్ పీవీ జూనియర్ కళాశాల తెలుగు విభాగాధిపతి ఆస్కా చైర్మన్, ప్రముఖ కవి, గాయకుడు డాక్టర్ బాల చందర్‌ను ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ అవార్డు వరించినట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోన ఎలివేట్స్ కల్చరల్ ఎలైట్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో విద్య, సాహిత్య రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేసినట్లు తెలిపారు. పలువురు సాహితీ అభిమానులు, కవులు, సిబ్బంది తనను అభినందించారన్నారు.

అసమానతలపై ఉద్యమించాలి

భీమవరం అర్బన్, ఆగష్టు 14 : సాంఘిక అణచివేత, అసమానతలపై మరింత ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్ కోయ్యే మోషేన్ రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో కులవివక్ష వ్యతిరేఖ పోరాట సంఘం రాష్ట్ర శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. సివిల్స్‌లో ఆలిండియా 833వ ర్యాంకు సాధించిన కోయ్యే మోషేన్ రాజు కుమారుడు చిట్టిబాబును ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దడాల సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షులు బలరాం, తదితరులు అభినందించారు. రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బి.రఘురాం, టి.చిరంజీవి, జి.నటరాజు, బాగం లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి కే క్రాంతిబాబు.

బహుజన కులాల పోరాట యోధుడు 'జాన'

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 14 : బహుజన కులాల పోరాట యోధుడు జాన నాగేశ్వరరావు బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సుకు ఎంతగానో కృషి చేశారని పలువురు వక్తలు అన్నారు. జాన నాగేశ్వరరావు 95వ జయంతి సందర్భంగా వీవర్స్ కాలనీలోని కమ్యూనిటీ భవనంలో జరిగిన సంస్మరణ సభకు ఆయన కుమార్తె జాన జాన్సీ లక్ష్మీబాయ్ అధ్యక్షత వహించారు. జాన విగ్రహ దాత చింతపల్లి గురుప్రసాద్, పెన్మెత్స సుబ్బరాజు, సమన్వయ కర్త యర్రంశెట్టి వెంకటరత్నం, కమిటీ సభ్యులు, తదితరులు నాగేశ్వరరావు సేవలను కొనియాడారు. ముందుగా లాకుల సెంటర్‌లోని జాన నాగేశ్వరరావు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు యు.కపర్థి, వి.గణేష్, ఆర్.పెదమధు, ఎం.బసవ రాజు, తదితరులు పాల్గొన్నారు.

కొల్లి రమావతికి పురస్కారం



తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 14: శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి తెలుగు భాషాభివృద్ధికి, కళాకారుల ప్రోత్సాహానికి చేస్తున్న కృషికి గాను ఆమెకు గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ తెలుగు తేజం జాతీయ విశిష్ట పురస్కారం అందించనుంది. ఈ నెల 18న అమలాపురంలో పురస్కారంతో పాటు రూ.10 వేల నగదు బహుమతి అందించనున్నట్టు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సీకేవీ రామారావు తెలిపారు.

యనమదుర్రుపై వంతెనకు మరమ్మతులు

పాలకోడేరు, ఆగస్టు 14: గొల్లలకోడేరు, పాలకోడేరు గ్రామాలను కలుపుతూ యనమదుర్రు డ్రైన్ పై నిర్మించిన వంతెనకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ బ్రిడ్జీ గత కొంత కాలంగా పాడైపోయి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. ఇదే విషయమై 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని కూడా గతంలో ప్రచు రించింది. ఇదే విషయాన్ని గ్రామస్థులు ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘు రామకృష్ణం రాజు దృష్టికి తీసుకెళ్ళడంతో ఆయన అనుచరుడు, పాలకోడేరు సొసైటీ బ్యాంకు మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి నాగరాజు దాతలను సేకరించి బుధవారం బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టారు.

నేడు కలిదిండి అబ్బాయిరాజు పార్కు ప్రారంభం

ఉండి ఆగస్టు 14 : ఉండిలో మాజీ మంత్రి కలిదిండి అబ్బాయిరాజు జన్మభూమి పార్కుకు కళకళలాడుతోంది. ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణంరాజు ఆధ్వర్యంలో దాతలు సహకారంతో పార్కును అభివృద్ధి చేశారు. పార్కులో కలిదిండి అబ్బాయిరాజు విగ్రహం, ఐ లవ్ ఉండి లోగో, వివిధ పరికరాలు ఏర్పాటు చేశారు. గురువారం కలెక్టరు నాగరాణి, ఎమ్మెల్యే కనుమూరు రఘరామకృష్ణంరాజు చేతుల మీదుగా ప్రారంభిస్తారని గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాగిత బుజ్జి, మండల అధ్యక్షుడు కరిమెరక నాగ రాజు తెలిపారు. పార్కును కాటన్ విగ్రహదాత వేగేశ్న కనకరాజు సూరి పరిశీలించారు. కలదిండి అబ్బారాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

న్యాయ విజ్ఞాన సదస్సు


భీమవరంలో నిర్వహిస్తున్న న్యాయ విజ్ఞాన సదస్సు

భీమవరం క్రైం, ఆగస్టు 14 : వితంతు పింఛనుకు అర్హతలుండి పింఛన్ రాకపోతే భీమవరం మండ న్యాయసేవాధికార సంస్థ ను సంప్రదిస్తే ఉచిత న్యా య సహాయం అందజేసి వితంతు పింఛను అందే లా చర్యలు తీసుకుంటామని సంస్థ ప్యానల్ న్యాయవాదులు ఎస్.సుధీర్, కె.జ్యోతి, డి.రవికిరణ్ తెలిపారు. రాష్ట్ర మరియు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం వితంతు పింఛన్లపై అవగాహన కల్పించేందుకు 25వ వార్డు సచివాలయంలో సిబ్బందితో కలిసి న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. వార్డు అడ్మిన్ పెంటకోటి బాలాజీ వెంకటేశ్వరరావు, ఎడ్యుకేషన్ సెక్రటరీ తాండ్ర నాగేశ్వరరావు, ప్లానింగ్ సెక్రటరీ తాతాజీ శశాంక్, హెల్త్ సెక్రటరీ తిరుమాని కనకదుర్గ, రెవెన్యూ సెక్రటరీ కొపర్తి ప్రియాకుమారి, వెల్ఫేర్ సెక్రటరీ బాజంకి నాగమణి పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా యాత్ర


తాడేపల్లిగూడెంలో ఏబీవీపీ నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి, బాబ్జి


ఉండి మండలం ఉప్పులూరులో 600 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన


వైఎస్‌పాలెంలో 78 మీటర్ల జాతీయ జెండాతో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు


కొవ్వాడలో జాతీయ పతాకంతో విద్యార్థులు నిర్వహిస్తున్న ర్యాలీ

నరసాపురం రూరల్, అగస్టు 14: స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా వైఎస్‌పాలెంలో బుధవారం 78 మీటర్ల జాతీయ జెండాతో భారీ ప్రదర్శన చేశారు. గ్రామస్థులు, విద్యార్థులు జెండాలు చేతబట్టి నిర్వహించిన ర్యాలీని సర్పంచ్ వైఎస్ నాగముత్యామాంబ ప్రారంభించారు. మాజీ ఏఎంసీ ఉపాధ్యక్షులు వైఎస్ బాబులు, వాసు, హెచ్ఎం శ్రీనివాస్, చైర్మన్ కె.రాధకృష్ణ, వైఎస్ బాబ్జీ, సత్తిబాబు, కార్యదర్శి రఘురాం పాల్గొన్నారు.

● ఆకివీడు రూరల్ : సిద్ధాపురంలో దామోదరం సంజీవయ్య జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. సర్పంచ్ చిట్టిబాబు, భూపతిరాజు తిమ్మరాజు పాల్గొన్నారు.

● భీమవరం ఎడ్యుకేషన్ : భారతీయ భవన్స్ స్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు సుమారు 100 మంది హర్‌ఘర్ తిరంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. విద్యా భవన్స్ ప్రిన్సిపాల్ ఎల్‌వీ రమాదేవి, భవన్స్ సంచాలకులు డాక్టర్ బీవీ శేషగిరిరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ శేఖర్ కుమార్, ఆర్మీ వింగ్ కోచ్ శ్రీకాంత్ పాల్గొన్నారు. అలాగే ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీకేజే ప్రసూన, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.అరవింద్ స్వామి, కళాశాల లైబ్రేరియన్ ఎల్.నరసింహరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● పెంటపాడు : హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రత్తిపాడులో 100 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. టీబీఆర్ అధినేత తనుబుద్ధి బోగేశ్వరరావు, ముప్పిడి రమేష్, వీర్ల గోవిందన్న, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

● తాడేపల్లిగూడెం రూరల్ : పట్టణంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, నాయకులు పసుపులేటి రామారావు, నరిసే సోమేశ్వర రావు, చిట్యాల రాంబాబు, కోట రాంబాబు, తుమరాడ చిన్న త్రివర్ణ పతాకాలు చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. మిలిటరీ మాధవరంలో నిర్వహించే స్వాతంత్ర వేడుకలు ప్రత్యేకం. ఆ గ్రామంలో జెండా ఆవిష్కరించేది దేశ రక్షణ కోసం పనిచేసిన విశ్రాంత సైనికులు. దేశ రక్షణ కోసం అసువులు బాసిన సైనికులకు అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పించి నేటి తరం సైనికులకు స్ఫూర్తి రగిలిస్తారు.

● ఉండి : ఉప్పులూరులో బీజేపీ మండల అధ్యక్షుడు యర్రా విక్రమ్ ఆధ్వర్యంలో 600ల అడుగుల జాతీయ జెండాను ప్రదర్శించారు. ఉండి అసెంబ్లీ బీజేపీ కన్వీనరు కె.రామ్మూర్తి, కోకన్వీనరు జి.వెంకటేశ్వరరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు కె.నాగబాబు, మండల ప్రధాన కార్యదర్శి సూర్య ప్రకాశ్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు కె.నాగరాజులు, ఉప్పులూరు హైస్కూల్ హెచ్ఎం చక్రవర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే శశి స్కూల్ విద్యార్థు లు నిర్వహించిన ర్యాలీలో ఎస్.చలపతిరావు, కె.నాగబాబు, పి.రాము తదితరులు పాల్గొన్నారు.

● పాలకొల్లు అర్బన్/ పాలకొల్లు రూరల్, ఆగస్టు 14 : డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.రవిశంకర్, ఎన్ఎస్ఎస్ పీవో విజయలక్ష్మి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. చాంబర్ కళాశాలల ఆధ్వర్యంలో ఎల్ఆర్ పేటలో ఇంటింటికి త్రివర్ణ పతాకాలు పంపిణీ చేశారు. పాలకవర్గ చైర్మన్ కేవీఆర్ నరసింహరావు, కార్యదర్శి కె.రామరాజు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు. ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో తిరంగ కాన్వాస్ పెయింటిగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బుధవారం బహుమతులు అందజేస్తారు.

● తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. 450 అడుగుల జాతీయ జెండాతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ పాల్గొన్నారు.

● భీమవరం టౌన్ : మెప్మా ఆధ్వర్యంలో సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులు, ఆర్పీలు, సిబ్బంది జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామ ప్రారంభించారు. అసిస్టెంట్ కమిషనర్ శ్రీవిద్య, సిటీ మిషన్ మేనేజర్ సీహెచ్ నానిబాబు, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్‌లు, ఆర్పీలు స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

● శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 240 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. కొవ్వాడ అన్నవరం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం పాటిబండ్ల రంగవల్లి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి అల్లూరి సాయి దుర్గరాజు, కంతేటి వెంకటరాజు, కడలి వెంక టేశ్వరరావు, డ్రిల్ మాస్టర్ విశ్వనాథ రాజు, గ్రామ పెద్దలు సుబ్రమణ్యం, విజయ కుమార్ రాజు పాల్గొన్నారు.

ట్రీట్మెంట్ ప్లాంట్‌తో చెత్త నిర్మూలనకు చర్యలు

జిల్లా కలెక్టర్ నాగరాణి


యడ్లబజారులోని డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 14 : చెత్త నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. పట్టణంలోని 12వ వార్డు యడ్ల బజారులోని డంపింగ్ యార్డును కలెక్టర్ బుధవారం పరిశీలించారు. కొన్నేఏళ్ళుగా ఇక్కడ పేరుకుపోయిన చెత్తను ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా నిర్మూలిస్తున్న విధానాన్ని కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జలాలు కలుషితం కావడంతో పాటు, ప్రజల ఆరోగ్యంపై చెడు ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా చెత్తను త్వరిత గతిన నిర్మూలన చేయాలని సూచించారు. దీని ద్వారా వచ్చిన మట్టిని ఖాళీ స్థలాల్లో మెరక చేసుకునేందుకు వినియోగించాలన్నారు. పట్టణంలో వచ్చే 25 వేల మెట్రిక్ టన్నులను ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా నిర్మూలన చేయడానికి రూ.1.93 కోట్లకు ప్రభుత్వం ఏజెన్సీకి అప్పగించిందన్నారు. పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా షాపుల యజమానులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. తడి పొడి చెత్తను విడివిడిగా సేకరించాలన్నారు. రోడ్లపై అవులు, ఇతర పశువులు విచ్చల విడిగా సంచరించకుండా యజమానులకు నోటీసులు ఇవ్వాలని కమిషనర్‌కు కలెక్టర్ నాగరాణి ఆదేశాలిచ్చారు. అయినప్పటికీ యజమానులు స్పందించకుంటే ఆవులను గోశాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో ఎం.అచ్చుత అంబరీష్, కమిషనర్ బి.విజయ సారధి, తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్, డీఈ కె.రాజకుమార్, టీపీవో కె.వీరబ్రహ్మం, ఏఈలు ఎం.సాంబశివుడు, జి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభం



పాలకొల్లు అర్బన్, ఆగస్టు 14 : స్థానిక టాక్సీ స్టాండ్ సమీపంలో శుక్రవారం నుంచి అన్న క్యాంటిన్ ప్రారంభం కానున్నది. పాలకొల్లులో రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామా నాయుడు అన్న క్యాంటిన్‌ను ప్రారంభించనున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం రూ.ఐదుల చొప్పున అందజేస్తారు. అల్పాహారం ఉదయం 7.30 నుంచి 10 వరకూ, మధ్యాహ్న భోజనం 12.30 నుంచి మూడు గంటల వరకూ. రాత్రి భోజనం 7.30 నుంచి తొమ్మిది గంటల వరకు లభిస్తాయి, ఆదివారం సెలవు

● తణుకు : అన్న క్యాంటీన్ శుక్రవారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రారంభించనున్నారు. ఇప్పటికే క్యాంటిన్ వద్ద పూర్తిస్థాయి మరమ్మతులు చేశారు. క్యాంటీన్‌లో కేవలం రూ.ఐదు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందజేస్తారు. పేదలంతా వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ కోరారు.

63 రోజులుగా ఉచితంగా భోజనం

ఆకివీడు రూరల్ ఆగస్టు 14 : గ్రామంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 63 రోజులుగా అన్న క్యాంటీన్‌లో ఉచితంగా భోజనం పెడుతున్నారు. పప్పు, కూర, పచ్చడి, సాంబారు, మజ్జిగ, అన్నంతో సుమారు 300 మందికి వండి వారుస్తున్నారు. కూటమి ప్రభుత్వమొచ్చాక కడుపునకు పట్టెడన్నం తింటున్నామని పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జోగి కుటుంబానికి శిక్ష తప్పదు


మాజీ ఎమ్మెల్సీ అంగర

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 14 : మాజీ మంత్రి జోగి రమేష్, కుటుంబ సభ్యుల అక్రమాల భాగోతం చూస్తుంటే పుట్టలోంచి పాములు వచ్చినట్టుందని, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ అన్నారు. స్థానిక ఎల్ఆర్ పేటలోని ఆయన నివాసంలో బుధవారం విలేకర్ల సమావేశంలో అంగర మాట్లాడారు. అగ్రి గోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామంటూ మంత్రి జోగి రమేష్‌కు అక్రమంగా కట్టబెట్టే విధంగా చేశారని అంగర అన్నారు. పోలీసులు రాజీ వ్‌ను అరెస్టు చేస్తే బీసీలంఅంటూ కులం కార్డు తీసుకురావడానికి సిగ్గులేదా? అని అంగర ప్రశ్నిం చారు. అవినీతిలో రమేష్‌కు భారతరత్న ఇవ్వవచ్చన్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు కక్ష సాధింపులకు దిగుతున్నారని ఆరోపిస్తున్న జోగి రమేష్ తమ హయంలో ఎంత మందిపై కక్ష సాధింపుల కేసులు పెట్టారో గుర్తు చేసుకోవాలన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేసిన అక్రమాలకు జోగి కుటుంబానికి చట్టపరంగా శిక్షలు తప్పవని మాజీ ఎమ్మెల్సీ రామమోహన్ స్పష్టం చేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వైరింగ్ తనిఖీ

అత్తిలి, ఆగస్టు 14 : షార్ట్ సర్క్యూట్‌లు సంభవించకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఫైర్ ఆఫీసర్ బి.శ్రీనివాసరావు చెప్పారు. అత్తిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విద్యుత్ వైర్ల పరిస్థితి, ఇన్వర్టర్ బ్యాటరీలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యాలయానికి సంబంధించిన రికార్డు రూమును సందర్శించి సూచనలు చేశారు. విద్యుత్ వైరింగ్ సక్రమంగా ఉండేలా చూసుకోవాలని కార్యాలయ సిబ్బందికి సూచించారు. సబ్ రిజిస్ట్రార్ జి. శివయ్య సీనియర్ అసిస్టెంట్ పి. రాంబాబు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్న గోపురంలో హుండీ చోరీ

పాలకొల్లుఅర్బన్, ఆగస్టు 14 : పట్టణంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన శ్రీ అష్టభుజలక్ష్మీ నారాయణ స్వామివారి ఆలయంలో (చిన్నగోపురం) మంగళవారం రాత్రి చోరీ జరిగినట్టు ఈవో బి.శంకర్ తెలిపారు. ఆలయ తూర్పు వైపున ఈశాన్యంలోని గేటు ద్వారా ఆలయంలోకి ప్రవేశించి ధ్వజస్తంభం వద్ద ఉన్న హుండీని పగుల గొట్టి నగదు దోచుకు పోయినట్టు ఈవో శంకర్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల్లో ఈ సంఘటన నమోదైందని ఈవో తెలిపారు. హుండీలో సుమారుగా రూ. ఐదు వేల వరకూ ఉండవచ్చునని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి పట్టణపోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గౌతమి స్పిన్ టెక్‌లో అగ్ని ప్రమాదం

తణుకు, ఆగస్టు 14: తేతలిలోని గౌతమి స్పిన్ టెక్ స్పిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం జరిగింది. బుధవారం జరిగిన ఈ ప్రమాదంలో గోదాములోని కాటన్ బేళ్ళు అగ్నికి ఆహుతై రూ. పది లక్షల ఆస్తి నష్టం సంభవించినట్టు అగ్నిమాపక అధికారి అజయ్‌కుమార్ తెలిపారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.

హిందువులపై దాడికి నిరసనగా ర్యాలీ

భీమవరం టౌన్/ఆకివీడు రూరల్, ఆగస్టు 14 : బంగ్లాదేశ్‌లు హిందులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మహిళలు మావుళ్ళమ్మ ఆలయం నుంచి కాషాయ జెండాలనుతో బుధవారం ర్యాలీ నిర్వహించారు.హిందూవుల ఊచకోతను నిరసిస్తూ, వారికి మద్దతుగా ఆకివీడు మండలం అజ్జమూరు గ్రామంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు.

పైపులైను పనులను పరిశీలించిన ఎమ్మెల్యే


పైపులైన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, ఆగస్టు 14 : గునుపూడి, బ్యాంకు కాలనీకి సంబంధించిన ప్రధాన పైపులైన్‌లకు అమృత్ పైపులైన్ జాయింట్ చేసిన పనులను బుధవారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) పరిశీలించారు. మార్కెట్‌లోని సంపు నుంచి నీటిని సరఫరా చేసే పైపునకు బీవీ రాజు మున్సిపల్ పార్కు వద్ద గునుపూడి, ప్రధాన పైపులకు నీటి సరఫరా చేసే పైపునకు జాయింట్ చేశారు. పనులు పూర్తి కావడంతో ఎమ్మెల్యే అంజిబాబు పరిశీలన చెయ్యగా మునిసిపల్ ఏఈ త్రినాద్ పనుల వివరాలను ఆయన వివరించారు.

అర్చక కుటుంబానికి పరామర్శ

కొత్త బస్‌స్టాండ్ వద్ద ఉన్న దాసాయంజనేయ స్వామివారి ఆలయ ప్రధానార్చకుడు ఘంటసాల భాస్కరశర్మ మృతి చెందడంతో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గూడూరి సోదరులకు..

భీమవరం అర్బన్ : టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గూడురి సుబ్బారావు, మాజీ కౌన్సిలర్ గూడురి రామకృష్ణ తల్లి గూడురి వీరమ్మ మరణం బాధకరమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. గూడురి సోదరులను వారి నివాసంలో ఎమ్మెల్యే పరామర్శించారు. ఆరో వార్డు మాజీ కౌన్సిలర్ బోక్కా చంద్రమోహన్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లీన్ తణుకుకు సహకరించండి


వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, ఆగస్టు 14 : క్లీన్ తణుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. రాష్ట్రపతి రోడ్డు, మార్కెట్‌లోని వ్యాపారులు, వినియోగదారులకు బుధవారం అవగాహన కల్పించారు. ఉదయం, సాయంత్రం వీధి వ్యాపారులు, దుకాణదారులు చెత్తను డస్టు బిన్‌ల్లో వేయాలన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యతన్నారు.

నారాయణరావు చౌదరి సేవలు మరువలేనివి

మాజీ ఎమ్మెల్యే వైటీ రాజా తండ్రి యలమర్తి నారాయణరావు చౌదరి పట్టణానికి, రైతులకు విశేష సేవలందించారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. నారాయణరావు చౌదరి జయంతి సందర్భంగా కో ఆపరేటివ్ స్టోర్సు, విత్తన శుద్ధి కర్మాగారం వద్ద గల ఆయన విగ్రహాలకు, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు కలగర వెంకట కృష్ణ, కంటిపూడి రాంబాబు, గమ్మళ్ళ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా'

ఇరగవరం, ఆగస్టు 14 : వైసీపీ అసమర్ధ పాలనతో గ్రామాలన్నీ అధ్వానంగా తయా రయ్యాయని, ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు పూర్తి సహకారం అందించి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఇరగవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 15వ ఫైనాన్స్ నిధులు నేరుగా పంచా యతీలకు జమ చేస్తామన్నారు. సెప్టెంబరు మొదటి వారం నుంచి రెవెన్యూ సదస్సులు జరుగుతాయని, ఎవరికైనా భూ సమస్యలుంటే 45 రోజుల్లో పరిష్క రించడం జరుగుతుందన్నారు. పంచాయతీల్లో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఖర్చు పరిమితిపై ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం గోటేరు గ్రామంలో ఉపాధి పథకం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమం ఎమ్మెల్యే ప్రారంభించారు.

ముగిసిన సర్పంచ్‌ల శిక్షణ తరగతులు


పెనుగొండలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస దొర

నరసాపురం రూరల్/పెనుగొండ/ఆచంట/పాలకొల్లు రూరల్/అత్తిలి/ఉండి/ఆగస్టు 14: మండల పరిషత్ కార్యాలయాల్లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సర్పంచ్, కార్యదర్శుల శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. గ్రామాల ఆభివృద్ధి, సంపద తయారీ కేంద్రాలు, ఆర్థిక వనరులు, వీధి దీపాలు ఏర్పాటు, నిర్వహణ, సీసీ చార్జీలు చెల్లింపులు, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, ఈ గ్రామ్ స్వరాజ్ పోర్టల్, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన పొత్తూరి



ఉండి ఆగస్టు 14: మంత్రి లోకేశ్‌ను రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహణాధికారి పొత్తూరి వెంకటేశ్వరరాజు బుధవారం అమరావతిలో కలిసినట్లు ఆయన తెలిపారు. ఆయనతో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యపై అవగాహన

పెనుగొండ, ఆగస్టు 14 : చదువు మధ్యలో మానేసిన వారు మరలా పెనుగొండ చెరుకువాడ జడ్పీహెచ్ఎస్ స్కూల్లో చేరి పదో తరగతి పరీక్షలు నేరుగా రాయవచ్చని ఎంఈవోలు శుభాకరరావు, రామకృష్ణ తెలిపారు. స్కూల్లో హెచ్ఎం భరణీ కుమార్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్య కోసం ఓపెన్ స్కూల్ ప్రాముఖ్యతను తెలియజేస్తూ బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ వృత్తులు చేసుకొనే వారికి, అంగన్‌వాడీ ఆయాలకు, ప్రమోషన్ కోసం అవసరమైన వారికి ఇది చాలా ఉపయోగమన్నారు. సెలవు రోజుల్లో తరగతులకు హాజరవ్వాలన్నారు. పుస్తకాలు ఇంటికే పంపుతారన్నారు. ఈ నెల 28వ తేదీ చివరి తేదీ అన్నారు. వివరాలకు 94917 19783, 94942 38113లలో సంప్రదించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి పాటల పోటీలు

నరసాపురం, ఆగస్టు 14: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మథర్ థెర్సిసా నరసాపురం దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని వలంథర్ రేవులో జిల్లా స్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం నిర్వాహకులు ఆనంద్ చెప్పారు.

చిత్ర లేఖనం పోటీలు

ఆకివీడు, ఆగస్టు 14 : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా అమర్ ఆర్ట్ అకాడమీ, హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం చిత్రలేఖనం పోటీలు స్థానిక మాదివాడ కల్యాణ మందిరంలో జరిగాయి. సీనియర్, జూనియర్స్ విభాగంలో జిమ్ అనిల్, అమర్ మిత్ర పోటీలు నిర్వహించారు.

రూరల్ ఎస్ఐగా వెంకట సురేశ్

నరసాపురం, ఆగస్టు 14: రూరల్ ఎస్ఐగా వెంకట సురేశ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన నల్లజర్ల నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసినా గురవయ్య యలమంచిలి బదిలీ అయ్యారు.

రైతులకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలు

నరసాపురం రూరల్, అగస్టు 14 : వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై విత్తనా లందిస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి తెలిపారు. లక్ష్మణేశ్వరంలో బుధవారం రైతులకు జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి చిన్న చేతుల మీదుగా విత్తనాలందించారు. సర్పంచ్ తిరుమాని వెంకట్రావు, ఎంపీటీసీ హరికృష్ణ, శ్రీనివాస్, మల్లిపూడి చిన్నబాబు, నాగేంద్రకుమార్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం కిట్లు అందజేత

భీమవరం అర్బన్, ఆగస్టు 14: స్వేచ్ఛ మహిళ సంఘం ఆధ్వర్యంలో హెచ్ఐవీ బాధిత కుటుంబాలకి పౌష్టికాహారం కిట్లు, విద్యార్థులకు నోటు పుస్తకాలు బుధవారం వన్ టౌన్ సీఐ నాగరాజు చేతుల మీదుగా అందజేశారు. ఆరోగ్య శాఖ మధు, ఏఆర్‌టీ సెంటర్ వైద్యులు గోవిందబాబు, నిర్వాహకులు అల్లు శ్రీనివాస్, స్వేచ్ఛ మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ

పెంటపాడు, ఆగస్టు 14: ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పుట్టినరోజును పురస్కరించుకుని బోడపాడులో బుధవారం జనసేన నాయకుడు మట్టా సత్యానారాయణ, మాజీ సర్పంచ్ రాంబరికిల బాలమురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎంపీయూపీ పాఠశాలలో 114 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ప్యాడ్స్, జామెంట్రి బాక్స్‌లు, పలకలు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంచారు. జనసేన మండల అధ్యక్షుడు పుల్లా బాబి, కసిరెడ్డి మధులత, గుబ్బల వెంకట సత్యనారాయణ, రాంబరికిల శ్రీనివాస్, చిన్నారావు, మట్టా అంజిబాబు, పాఠశాల యాజమాన్య కమిటి చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మానసిక బాలలకు రగ్గులు పంపిణీ

భీమవరం టౌన్, ఆగస్టు 14 : శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా అరుణోదయ మనో వికాస కేంద్రంలో మానసిక బాలలకు రగ్గులు, స్వీట్లు పంపిణీని జర్మనీ దేశ సాఫ్ట్ వేర్ ఇంజనీర్, సోషల్ వర్కర్ షారా హాల్ మల్ ప్రారంభించారు. అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, అరుణోదయ మనో వికాస కేంద్రం డైరెక్టర్ చింతలపాటి అరుణదేవీ, కంతేటి వెంకటరాజుపాల్గొన్నారు.

హైస్కూల్‌కు రూ.20 వేల చెక్కు అందజేత

ఆచంట, ఆగస్టు14 : వేమవరం హైస్కూల్ పూర్వపు హెచ్ఓం పి.విజయలక్ష్మి ఆమె భర్త రాజగోపాల్ పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన ఎం.మౌనిక, నవీన, జి.పద్మజకు నగదు, మెమోంటుల ఇచ్చి ప్రోత్సహించారు. పాఠశాల సహాయకులు బండి ప్రసాద్ మాస్టారు ద్వారా ప్రస్తుత హెచ్ఎం నెక్కంటి కృష్ణవేణికి రూ. 20 వేలు చెక్కును అందజేసి దీనిపై వచ్చే వడ్డీని పదో తరగతిలో ప్రథమ, ద్వితీయస్థానం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేయాలని కోరారు.

గరల్స్ హైస్కూలో ఎస్పీఎల్ ఎన్నికలు

భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 14 : పీఎస్ఎం గరల్స్ హైస్కూల్లో ఎస్పీఎల్, ఏఎస్పీఎల్ ఎన్నికలు నిర్వహించారు. 1,042 విద్యార్థినిలకు గాను 778 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల ఓట్లు లెక్కింపు నిర్వహించగా ఎస్పీఎల్‌గా కె.పార్వతి, ఏఎస్పీఎల్‌గా బి.సుభాషిణి గెలుపొందారని హెచ్ఎం వీఎం రాధాకృష్ణ తెలిపారు.

దోమలను దరిచేరనివ్వొద్దు

పెంటపాడు, ఆగస్టు 14: దోమలు దరిచేరకుండా చూసుకోవాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. ముదునూరు పీహెచ్‌సీ పరిధిలోని మీనవల్లూరులో బుధవారం వైద్యాధికారి డాక్టర్ పూజిత ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రభాకర్‌కు విరాళం అందిస్తున్న కొవ్వలి మహిళలు

రాజధాని నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

పెదవేగి, ఆగస్టు 14 :ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం రాష్ట్ర ప్రజలు గర్వించేలా ఉంటుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దెందులూరు మండలం కొవ్వలి గ్రామ మహిళలు గ్రామంలో ఇంటింటికి తిరిగి సేకరించిన నగదు రూ.5,00,516లను పెదవేగి మండలం దుగ్గిరాలలో ఎమ్మెల్యేకు అందించారు. ఐదేళ్ళ రాక్షస పాలనలో రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయిందన్నారు.ప్రజల సహకారం, భాగస్వామ్యంతో, అంతర్జాతీయ ప్రమాణాలతో రాజధాని నిర్మాణం పూర్తి చేసుకుంటుందని తెలిపారు.కొవ్వలి మహిళల సంకల్పాన్ని అభినందించారు. పార్టీ నాయకులు మాగంటి నారాయణ ప్రసాద్, బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, శ్రీనివాసరావు, నంబూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అంటువ్యాధుల అంతానికి 'మీకు తెలుసా' ప్రచారం

అక్టోబరు 12 వరకు అవగాహన

భీమవరం క్రైం, ఆగస్టు 14 :నాకో మార్గదర్శకాలతో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాలతో రెండు నెలలు పాటు "ఇంటెన్సిఫైడ్ ఐఈసీ ప్రచారం" ఈనెల 12వ తేదీన నుంచి ప్రారంభించినట్టు జిల్లా డీఎల్‌టీవో డాక్టర్ భానునాయక్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి కళ్యాణి అన్నారు. భీమవరం ప్రభుత్వాసుపత్రిలో బుధవారం పశ్చిమగోదావరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం వారు "మీకోసం" కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ, పోస్టర్ల ఆవిష్కరణ జరిగింది. ఏఆర్టీ సెంటర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.గోవిందబాబు, డాక్టర్ రాంబాబులు మాట్లాడుతూ 2030 నాటికి ఎయిడ్స్, ఇతర అంటువ్యాధుల మహమ్మారిని అంతం చేయాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నామన్నారు. ఏపీ శాక్స్ పశ్చిమగోదావరి జిల్లా మధుసూదన రావు మాట్లాడుతూ ఈ రెండు నెలల్లో సోషల్ మీడియా, జానపద ప్రదర్శనలు, కళాశాలలు, జిల్లాలో 250 గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో అవగాహన నిర్వహిస్తామన్నారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్, డీఐసీ హరనాథ్, ఏఆర్టీ కౌన్సిలర్లు ప్రభాకర రావు, పూర్ణేంద్ర, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ నిట్‌కు విదేశీ విద్యార్థులు

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 14 : తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌కు విదేశీ విద్యార్థులు పోటెత్తుతున్నారు. ఈ ఏడాది బీటెక్‌లో ప్రవేశానికి 250 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, తదితర దేశాల నుంచి ఏపీ నిట్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. విదేశీ విద్యార్థుల కోసం ఏపీ నిట్‌లో 20 సీట్లు కేటాయించారు. గతంలో కేంద్ర ప్రభుత్వమే విదేశీ విద్యార్థుల కోసం సీట్లు కేటాయించేది. అడ్మిషన్లు నిర్వహించేది. ఇప్పుడు ఆ బాధ్యతను ఏపీ నిట్‌కు అప్పగించారు. విదేశీ విద్యార్థుల కోసం అంతర్జాతీయ స్థాయిలో హాస్టల్ వసతి సదుపాయాలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల అర్హతను బట్టి అడ్మిషన్లు కల్పించనున్నారు.

స్టాక్ పాయింట్లలో ఇసుక

భీమవరం టౌన్, ఆగస్టు 14 :తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఉసులుమర్రులో- 7,157 మెట్రిక్ టన్నులు, పెండ్యాలలో-1,11,468 టన్నులు, నిడదవోలు మండలం పందలపర్రు-39,278 టన్నులు, ఆయా స్టాక్ పాయింట్లు వద్ద టన్నుకు రూ.270 చెల్లించి ఉచిత ఇసుక పొందవచ్చని కలెక్టర్ నాగరాణి తెలిపారు. రావులపాలెం మండలం రావులపాడు-865 మెట్రిక్ టన్నులు, రావులపాడు-2లో 861 మెట్రిక్ టన్నులు ఆయా స్టాక్ పాయింట్లు వద్ద టన్నుకు రూ.265 చెల్లించి ఇసుక పొందవచ్చుఅని కలెక్టర్ తెలిపారు.

ముగిసిన ఫొటో ఎగ్జిబిషన్



భీమవరం టౌన్, ఆగస్టు 14 : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం రీజనల్ శాఖ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహిస్తున్న 'భయానక విభజన స్మరణ' ఫొటో ఎగ్జిబిషన్ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం సర్ సీవీ రామన్ స్కూల్, పీఎస్ఎం, సంస్కార్ స్కూల్ విద్యార్థులు ఎగ్జిబిషన్ తిలకించారని బ్యాంక్ లీడ్ డిస్టిక్ మేనేజర్ అన్నవరపు నాగేంద్ర ప్రసాద్, మెయిన్ చీఫ్ మేనేజర్ నిర్మల జ్యోతి తెలిపారు. ఇటువంటి విషయాలను భావితరాలకు తెలియ జేయాలని ప్రధాని మోదీ పిలుపు మేరకు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. చెరుకువాడ రంగసాయి, నరహరిశెట్టి కృష్ణ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయలో ముగిసిన క్రికెట్ జట్ల ఎంపిక



పెదవేగి, ఆగస్టు 14 : ఏలూరు జిల్లా పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న రీజనల్ స్థాయి క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు బుధవారం ముగిశాయి. 14, 17, 19 ఏళ్ళ బాలుర విభాగం జట్లు,17 ఏళ్ళ బాలికల జట్టును ఎంపిక చేశామని నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. పీఈటీ కె.కృష్ణ పర్యవేక్షణలో, ఏలూరు ఎన్‌సీఏ కోచ్ సత్యమూర్తి, సిబ్బంది ఎంపిక పోటీలు నిర్వహించారు. హైదరాబాద్ రీజనల్ స్థాయిలో ఎంపిక చేసిన జట్లు త్వరలో హిమాచల్ ప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని సీతాలక్ష్మి తెలిపారు. హైదరాబాద్ రీజియన్ పరిధిలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక, పాండిచ్చేరి రాష్ట్రాల నుంచి మొత్తం 218 మంది విద్యార్థులు పాల్గొనగా 56 మంది విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి వివరించారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

తనఖా FINANCE

రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్నం సిటీ పరిధిలో ఉన్న ఇళ్ళు, స్థలములపై తనఖా ఫైనాన్స్ చేయబడును. సిబిల్ చూడబడదు. Cell: 9666547338

AJD:186728

FINANCE

గవర్నమెంట్ ఉద్యోగస్థులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా పద్ధతిలో ఫైనాన్స్ చేయబడును. సిబిల్ చూడబడదు. Govt. Reg.No.136/2009. Cell: 9666547338

AJD:186727

PLOT FOR SALE

➡ APCRDA అప్రూవ్డ్ ప్లాట్స్ ORR- రింగురోడ్డు అనుకొని అమరావతి రాజధానికి, ఐకానిక్ బ్రిడ్జి దగ్గరలో గేటెడ్ కమ్యూనిటీ నందు కలవు. బ్యాంక్ లోన్. సంప్ర: 9014437611, 7730099126.

AJG-9523

మా చిత్రంలో నటించే అవకాశం

★ శ్రీ పింటు లక్ష్మీనరసింహ ప్రొడక్షన్స్‌లో బాలా దర్శకత్వంలో చిత్రం సెప్టెంబర్ 19న రామానాయుడు స్టూడియోలో షూటింగ్ ప్రారంభం. అన్ని వయసుల కొత్త వారికి యాక్టింగ్ ఫ్రీగా నేర్పిస్తున్నాం. మా సినిమాలో అవకాశం పొందాలంటే వాట్సాప్ నెం.7981403355కు పంపండి. ఫిలింనగర్ Hyd. నరసింహారెడ్డి డైరెక్టర్.

AJH-002572

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో విచారించి క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారులతో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటీ



వేడుకలు నిర్వహించే ఏలూరు పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు.. అభివృద్ధి పథకాల శకటాలకు ముస్తాబు



జెండా పండక్కు ముస్తాబు



పెదవేగి : పెదవేగి మండలం భోగాపురంలో 2016 ఆగస్టు 15వ తేదీన తొలిసారి 235 అడుగుల భారీ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ప్రతి ఏడాది ఆగస్టు 15న , జనవరి 26న జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్నామని బీజేపీ ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కట్నేని కృష్ణప్రసాద్ తెలిపారు.

అంతటా జెండా పండుగ సందడి కనిపిస్తోంది.. స్వాతంత్ర్య దినోత్సవం కోసం అంతా ముస్తాబు చేస్తున్నారు. హర ఘర్ తిరంగా అంటూ జాతీయ జెండాలను పట్టుకుని ర్యాలీలు చేపట్టారు. ప్రతీ ఇంటిపై జెండా ఎగురవేస్తున్నారు. పంచాయతీ కార్యాలయాలు విద్యుద్దీపాల కాంతుల్లో వెలుగులు చిమ్ముతున్నాయి.. చిన్నారులు, స్కూల్ విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు అంతా జెండా పండక్కు రెడీ అయ్యారు



విద్యుద్దీపాలంకరణలో ఆచంట పంచాయతీ కార్యాలయం



పాలకొల్లులో జాతీయ పతాకాలతో విద్యార్థుల ర్యాలీ

రాష్ట్రపతి రోడ్డులో మువ్వన్నెల కాంతులు



తణుకు : రాష్ట్రపతి రోడ్డులో సెంట్రల్ లైటింగ్ పోల్స్‌పై మువ్వన్నెల లైటింగ్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు లైటింగ్ ఏర్పాటు చేశారు. పట్టణ ప్రజలు రాత్రి వేల మువ్వెన్నల కాంతులను తమ ఫోన్లలో బంధిస్తున్నారు.

అగ్గిపుల్ల, బియ్యపు గింజపై జాతీయ స్ఫూర్తి

ఏలూరు రూరల్, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏలూరుకు చెందిన మైక్రో ఆర్టిస్టులు దోరా శివప్రసాద్, మేతర సురేష్ బాబులు సూక్ష్మ చిత్రాల ద్వారా తన దేశభక్తిని చాటుకుంటున్నారు. శివప్రసాద్ బియ్యపు గింజపై జాతీయ జెండాను రూపొందించారు. సురేష్‌బాబు అరంగుళం ఎత్తులో అగ్గిపుల్లలపై సమరయోధుల చిత్రాలను చెక్కి అబ్బురపరిచారు. మహాత్మగాంధీ, అల్లూరి సీతారామ రాజు, సుభాష్ చంద్రబోస్ ఫొటోలను చెక్కారు.



బియ్యపుగింజపై జాతీయ జెండా



శివప్రసాద్



సురేష్‌బాబు



అగ్గిపుల్లపై జాతీయ నాయకులు



భీమవరంలో పంద్రాగస్టు వేడుకలకు ముస్తాబు



మాట్లాడుతున్న అదనపు డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి

అంటువ్యాధుల నివారణపై అప్రమత్తతేదీ ?

ఏలూరు అర్బన్, ఆగస్టు 14 : "మలేరియా, డెంగీ, చికన్ గున్యా అనుమానిత లక్షణాలు నమోదైన ప్రతీ కేసుకు సంబంధించిన టెస్టింగ్, ట్రీట్‌మెంట్‌లపై డీఎంహెచ్‌వోల వద్ద సమగ్ర సమాచారం ఉండాల్సిందే. వాటిపై కేస్ స్టడీస్ చేయాల్సిందే. ఈ రెండు జిల్లాల్లో అంటు వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యల సమాచారం రాష్ట్ర అధికారులకు గాని, కార్యాలయానికి గాని పంపకపోవడం విచారకరం. కేవలం పత్రికల్లో వచ్చే సమాచారంతోనే ఇక్కడి పరిస్థితులు మాకు తెలుస్తున్నాయి. డెంగీ, మలేరియా జ్వరాల కేసులు నమోదైన ప్రాంతాల్లో 8 వారాలపాటు ఫీవర్, లార్వా సర్వేలను తప్పనిసరిగా నిర్వహించండి" అంటూ వైద్య ఆరోగ్యశాఖ (అంటువ్యాధుల నియంత్రణ విభాగం) రాష్ట్ర అదనపు డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి వైద్యాధికారులను ఆదేశించారు. కీటకజనిత వ్యాధులు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని మలేరియా అధికారులు, క్షేత్రస్థాయి వైద్యాధికారులకు స్థానిక ఆశ్రం వైద్య కళాశాలలోని ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన సమావేశం వాడివేడిగా జరిగింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను సమన్వయ పరుచుకుని చేపట్టిన ముందస్తు చర్యల వల్ల రాష్ట్రంలో డయేరియా వ్యాప్తి నియంత్రణలోకి తీసుకు రాగలిగామని, దీనికి భిన్నంగా ఇటీవల కాలంలో అంటువ్యాధుల ద్వారా మరణాలు సంభవిస్తుండటం ఆందోళనకరమన్నారు. భవిష్యత్తులో ఇటువంటి మరణాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అంటు వ్యాధులు ప్రబలినపుడు అప్రమత్తతతో ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా మలేరియా, డెంగీవ్యాధులపట్ల క్షేత్రస్థాయి వైద్యాధికారులు స్థానికప్రజలకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తుండాలన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఏజెన్సీ ప్రాంతాలు, సరిహద్దు గ్రామాల చెక్‌పోస్టుల వద్ద వైద్యశిబిరాలు, టెస్టింగ్‌లను అనుమానిత వ్యక్తులకు నిర్వహించాలని ఆదేశించారు. హైరిస్క్ గ్రూపులుగా పరిగణించే కార్మికవర్గాలు అంటువ్యాధులకు గురికాకుండా ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు, సంబంధిత ఏరియాల్లో వ్యాధి నిరోధక రసాయనాలు, కీటకసంహారక మందులను పిచికారీ చేయించాలని సూచించారు. ఏలూరు జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ నాగేశ్వరరావు, రెండు జిల్లాల మలేరియా అధికారులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ రవికుమార్, స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ సంఘ నాయకులతో జడ్పీ సీఈవో సమావేశం

జడ్పీ పీఎఫ్ బ్యాలెన్స్ షీట్లలో లోపాల దిద్దుబాటుకు హెల్ప్‌డెస్క్ కోసం వినతి

ఏలూరు అర్బన్, ఆగస్టు 14 : ఐదేళ్ళుగా పెండింగ్‌లో వున్న జిల్లా పరిషత్ పీఎఫ్ బ్యాలెన్స్ షీట్లను బుధవారం జడ్పీ అధికారులు ఎట్టకేలకు విడుదల చేశారు. దీనిపై వెంటనే పీఆర్టీయూ జిల్లా నాయకులు ఆంజ నేయులు, సుబ్బారావు స్పందించారు. బ్యాలెన్స్ షీట్లలో మిస్సింగ్ క్రెడిట్లను గుర్తించేందుకు జడ్పీలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేయాలని, ఆన్‌లైన్‌లో అన్నిరకాల వివరాలు తెలుసుకునేందుకు వీలుగా సంబంధిత వెబ్‌సైట్లు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తూ జడ్పీ సీఈవో, డీఈవోలకు వినతిపత్రాలను అందజేశారు. పీఎఫ్ ఖాతాల నుంచి గరిష్ఠ రుణ పరిమితిని వైద్య అవసరాలకు రూ.4 లక్షలు, నాన్ రికవరబుల్ రుణాలు రూ.10 లక్షలు మంజూరు చేసేలా పెంచాలని కోరారు. తమ అభ్యర్థనలను పరిశీలిస్తామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు.



పితాని సూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మంచి మిత్రుడిని కోల్పోయా..

పితానిని పరామర్శించిన మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి

పోడూరు, ఆగస్టు, 14 : చిరకాల మిత్రుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త, విద్యావేత్త పితాని సూర్యనారాయణ మృతితో తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోదరుడు పితాని సూర్యనారాయణ ఇటీవల మృతిచెందారు. బుధవారం ఆయన పెదకార్యం సందర్భంగా కిరణ్‌కుమార్ రెడ్డి కొమ్ముచిక్కాల వచ్చారు. పితాని సత్యనారాయణను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. పితాని సత్యనారాయణ కంటే ముందు నుంచి సూర్యనారాయణతో స్నేహ సంబంధాలు ఉన్నాయని గుర్తు చేశారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, పితాని సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ మాజీ సీఎస్ సోమేష్‌కుమార్ తన మిత్రుడు సూర్య నారాయణ లేకపోవడం చాలా బాధాకరమని కన్నీటి పర్యంతం అయ్యారు.

ఉపకులపతి కోసం ఉద్యాన వర్సిటీ ఎదురుచూపు

రెండు నెలలుగా ఎక్కడి ఫైల్స్ అక్కడే

విద్యా సంవత్సరం ప్రారంభంలో అధికారులకు పరీక్ష



తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 14: ఉపకులపతి నియామకం కోసం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఎదురుచూస్తోంది. రెండు నెలలుగా ఉపకులపతి లేక అడ్మినిస్ట్రేషన్ ఫైల్స్ ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. దీనికి తోడు ఫైనాన్స్‌తో ముడిపడిన ఫైల్స్ ఇరుక్కుపోయాయి. ముఖ్యంగా వీసీ లేకపోవడంతో ఐసీఏఆర్ నుంచి రావాల్సిన నిధుల రాక ఆలస్యం అవుతోంది. దీంతో కాంట్రాక్టు సిబ్బంది జీతాలు, వర్సిటీ నిర్వహణకు ఇబ్బందులు తప్పడంలేదు. గతంలో ఉపకులపతిగా పనిచేసిన జానకీరామ్ నియామకం చెల్లదంటూ హైకోర్టు తీర్పు ఇవ్వడంతో ఆయన ఇష్టం లేకపోయినా రాజీనామా చేయాల్సి వచ్చింది. దీనికి తోడు గత వైసీపీ పాలనలో ఉద్యాన విశ్వవిద్యాలయ పాలన గతి తప్పి నిద్రావస్థకు చేరుకుందనే విమర్శలు ఉన్నాయి. వీటన్నింటికి చెక్ పెట్టేందుకు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వర్సిటీ ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది.వర్సిటీలో పనిచేసే ఉద్యోగుల్లో ఒకరికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాలా లేక బయట నుంచి వేరే వారికి ఉపకులపతిగా నియమించాలా అనే విషయమై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే వర్సిటి అధికారుల్లో సీనియారిటీ కోసం జాబితా సేకరించినా ఆ జాబితాలో ఓ మహిళా అధికారి ఉద్యోగ విరమణ కూడా చేశారు. ఆలస్యం చేయకుండా ప్రభుత్వం వీసీ నియామకంపై నిర్ణయం తీసుకోవాలని వర్సిటీ అధికారులు, విద్యార్థులు కోరుతున్నారు.

క్రైం కార్నర్



తీవ్ర గాయాలైన యువతిని ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది



కారు డ్రైవర్‌ను ప్రశ్నిస్తున్న పోలీసులు

కారు ఢీకొని యువకుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 14 : మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఒక కారు వెనుక నుంచి ఢీకొనడంతో మోటారు సైకిలిస్టు మృతి చెందగా, ఆ మోటారు సైకిల్‌పై ఉన్న యువతి తీవ్ర గాయాలకు గురైంది. పాలకొల్లుకు చెందిన పోతాడ తులసీ వెంకట రవికుమార్ కొంత కాలం నుంచి ఏలూరు అశోక్ నగర్‌లో ఉన్న బంధువుల ఇంటికి వచ్చి ఉంటూ చిన్న చిన్న కాంట్రాక్టు పనులు చేస్తున్నాడు. తన మోటారు సైకిల్‌పై బుధవారం ఉదయం ఏలూరు మెయిన్ బైపాస్‌లో ఆశ్రం వైపు నుంచి విజయవాడ రోడ్డువైపు ఏలూరుకు చెందిన అంజన వైష్ణవి (30) అనే యువతిని ఎక్కించుకుని వెళ్తున్నాడు. చొదిమెళ్ళ బ్రిడ్జి సమీపంలో వెనుక నుంచి ఒక కారు అతి వేగంగా ఢీకొనడంతో మణికుమార్ అక్కడికక్కడే మృతి చెందగా వైష్ణవి తీవ్ర గాయా లకు గురైంది. ఆమెను హైవే అంబులెన్సు సిబ్బంది ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన పశ్చిమ బెంగాల్‌కు చెందిన కారు ఆపకుండా వెళ్ళిపోతుండడంతో రోడ్డు సేఫ్టీ పోలీస్ సిబ్బందికి సమాచారం అందింది. దీంతో కలపర్రు టోల్ ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టి ఆ కారును, కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ఏలూరు రూరల్ పోలీసులకు అప్పగించారు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు ఆభరణాలు చోరీ..కేసు నమోదు

టి.నరసాపురం, ఆగస్టు 14: బంగారు ఆభరణాల చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గామహేశ్వరరావు తెలిపారు. మండలంలోని జగ్గవరం గ్రామానికి చెందిన తెలే కృష్ణ ఈనెల 13న ఇంటికి తాళం వేసి ఉదయం 8 గంటలకు తన భార్యతో కలిసి కూలి పనికి వెళ్ళారు. తిరిగి మధ్యాహ్నం 12.30 నిమిషాలకు ఇంటికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఇంటి తాళం కోసి ఉందని, దీంతో ఇంటిలోపలికి వెళ్ళి చూడగా బీరువా పగులగొట్టి బీరువాలో దాచిన రెండు బంగారపు వస్తువులు దొంగలు అపహరించారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గోదావరి తీరంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

కుక్కునూరు, ఆగస్టు 14: కుక్కునూరు మండలంలోని దామరచర్ల గోదావరి తీర ప్రాంతంలో గుర్తు తెలియని మహిళ శవం చెట్టుకొమ్మకు వేలాడుతున్నట్లు కుక్కునూరు ఎస్సై రామకృష్ణ బుధవారం తెలిపారు. మెడలో నల్లపూసల దండ ఉన్నట్లు తెలిపారు. వివరాలకు కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌లో 73826 23699 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

ఉంగుటూరు ఆగస్టు 14 : జాతీయ రహదారిపై ఉంగుటూరు వద్ద బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొన్న సంఘటనలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం సాయంత్రం ద్వారకాతిరుమల నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళ్తున్న ఆల్టో కారు ముందు వెళ్తున్న మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. బైక్‌పై ప్రయాణిస్తున్న భీమడోలు మండలం పూళ్ల గ్రామానికి చెందిన నాగార్జున, సతీష్‌లు గాయపడ్డారు. వీరిలో ఒకరికి తలకు తీవ్ర గాయం కావడంతో అంబులెన్స్‌లో ప్రవేటు ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ మణికుమార్ తెలిపారు.

ఆటో తిరగబడి డ్రైవర్ మృతి



భీమవరం క్రైం, ఆగస్టు 14 : ప్రమాదవశాత్తు ఆటో తిరగబడి ఒక వ్యక్తి చనిపోయినట్లు భీమవరం టూటౌన్ పోలీసులు చెప్పారు. వీరవాసరం గ్రామానికి చెందిన చింతా చందు (29) భీమవరం పట్టణంలోని చినరంగనిపాలెంలో నివాసముంటూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వస్తుండగా దుర్గాపురం వద్ద ప్రమాదవశాత్తు ఆటో తిరగబడి మృతి చెందాడు. మృతుడు భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కాళీచరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

నూజివీడు టౌన్, ఆగస్టు 14: మైక్రో ఫైనాన్స్ కంపెనీల ఏజెంట్ల వేధింపులతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నూజివీడు మండలం ముక్కొల్లుపాడులో చోటు చేసుకుంది. ముక్కొల్లుపాడుకు చెందిన తమ్మిశెట్టి సక్కమ్మ (40) పలు ప్రైవేటు మైక్రో ఫైనాన్స్ సంస్థల నుంచి సుమారు రూ. 3 లక్షల వరకు రుణం తీసుకుంది.వర్షాల కారణంగా పనులు లేక రుణ వాయిదాలు చెల్లించడంలో సక్కమ్మ విఫలమైంది. రుణం చెల్లించాల్సిందిగా ఏజెంటు నుంచి ఒత్తిడి రావడంతో వేధింపులు భరించలేక బుధవారం సాయంత్రం తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సక్కమ్మ భర్త రాజు సమాచారాన్ని బంధువులకు, పోలీసులకు తెలియజేయడంతో సక్కమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త ,అత్తమామలపై కేసు నమోదు

ఉండి ఆగస్టు 14: భర్త, అత్తమామలు వేధింపులకు గురి చేస్తున్నారంటూ భార్య అరుణకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం రాత్రి పోలీసులు అందించిన వివరాలు ఇవి. ఉండి మండలం మహదేవపట్నం గ్రామానికి చెందిన అరుణకుమారికి, కుమార్ రాజులకు 2005లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త, అత్త మామలు తనను వేధిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ద్వారకాతిరుమల, ఆగస్టు 14: యువతి అదృశ్యంపై ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి మంగళవారం రాత్రి అందరూ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఉదయం లేచి చూసేసరికి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెదికినా ఫలితం లేకపోయేసరికి వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



సీజ్ చేసిన పురుగు మందులతో విజిలెన్స్ అధికారులు

విజిలెన్స్ దాడి..ఎరువులు, పురుగు మందు సీజ్

ముసునూరు, ఆగస్టు 14: ముసునూరులోని శ్రీ అమృత ట్రేడర్స్‌లో ఎరువులు, పురుగు మందుల అక్రమ నిల్వలున్నట్టు అందిన సమాచారం మేరకు విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం దాడి చేశారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ, ఏవో పి.సురేష్, వ్యవసాయ ఏవో ఎస్.మధుమోహన్‌లు దుకాణంలో తనిఖీలు నిర్వహించి రూ. 23,68,485ల విలువ కలిగిన 16.121 మెట్రిక్ టన్నుల ఎరువుల్లో వ్యత్యాసాన్ని గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. అలాగే రూ.1,64,800 విలువైన నిషేధిత కలుపు మందును సీజ్ చేసి కోర్టులో క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

